అక్రమ డిప్యుటేషన్లు..!

- గిరిజన శాఖలో ఇష్టారాజ్యం
- నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులకు వార్డెన్లుగా బాధ్యతలు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు (ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: గిరిజన విద్యార్థుల చదువులు గాలికి వదిలేస్తూ.. కమీషన్లు దండుకుంటూ హాస్టల్ వార్డెన్లను డిప్యుటేషన్లపై బదిలీలు చేస్తూ అధికారులు ఇష్టారాజ్యంతో ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు నడుస్తున్నాయి. వివరాలకు వెళ్తే.. మానుకోట గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం (ఐటీడీఏ) పరిధిలో నడుస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్స్‌లో కాసులకు కక్కుర్తిపడి అక్రమ డిప్యుటేషన్లు బదిలీలు చేస్తున్నారని, ఒక రేటు నిర్ణయించి వసూళ్ల పర్వానికి తెరతీశారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసి అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఈనెల 4వ తేదీన వినతిపత్రం కూడా అందజేశారు.

డిప్యుటేషన్లు ఇవే..

కొత్తగూడెం ఆశ్రమ పాఠశాలలో ఎస్జీటీగా టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక మహిళ ఉపాధ్యాయురాలు జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ వార్డెన్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లారు. తొర్రూరులో పనిచేస్తున్న వార్డెన్‌ను కురవికి తీసుకువచ్చి కొన్ని సంవత్సరాలుగా ఒక్క చోటనే పనిచేయిస్తున్నారు. గూడూరులో పనిచేస్తున్న ఉపాధ్యాయుడుని తొర్రూరు హాస్టల్‌కు వార్డెన్‌గా నియమించారు. పత్తిపాక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని మహబూబాబాద్ బాలుర ఎస్టీ హాస్టల్ వార్డెన్‌గా నియమించారు. దంతాలపల్లిలో పనిచేస్తున్న రెగ్యూలర్ వార్డెన్‌ను మరిపెడ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హాస్టల్ ఇన్‌చార్జ్‌గా ఇచ్చారు. రెడ్యాల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీని నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్‌గా డిప్యుటేషన్ ఇచ్చారు. ఇలా సంవత్సరాల కొలది డిప్యుటేషన్లను ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సమగ్ర విచారణ చేయాలి



జిల్లాలోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించి న్యాయం చేయాలి. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం. మూడు సంవత్సరాలుగా జిల్లాలో అక్రమ డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయి. ఐటీడీఏ అధికారులు సమగ్ర విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- యుగేందర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇన్‌చార్జ్‌లను నియమించాం..



ఐటీడీఓల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లలో ఉన్న ఉపాధ్యాయులు, వార్డెన్లను ప్రభుత్వం బదిలీ చేస్తోంది. ఈక్రమంలోనే వారి స్థానంలో ఇన్‌చార్జ్‌లను నియమించాం. ఎలాంటి అక్రమ డిప్యుటేషన్లు జరగలేదు.

- ఎర్రయ్య, డీటీడీఓ, మహబూబాబాద్

గిరిజనులకు కాంగ్రెస్ సర్కారు పెద్దపీట


బెల్లయ్యనాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, భరత్ చందర్ రెడ్డి, తదితరులు

మహబూబాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ హయాంలో గిరిజనులు తీవ్రనిర్లక్ష్యానికి గురయ్యారని, గిరిజనులకు కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తుందని రాష్ట్ర షెడ్యూల్ ట్రైబల్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. బెల్లయ్యనాయక్ అభినందన, సన్మాన సభ టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిరిజనుల కళలను సాకారం చేసేందుకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర బడ్జెట్ లో రూ.1,756 కోట్ల రూపాయలు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం బాధితులు నేరుగా తన వద్దకు రావద్దని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ద్వారా మాత్రమే రావాలని ఆయన సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, జెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, గుగులోత్ దస్రునాయక్, దేవరం ప్రకాష్ రెడ్డి, మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి, నాయిని సత్యపాల్ రెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, కురెల్లి సతీష్, గొల్లపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

తాటి చెట్టే విద్యుత్ స్తంభం..!


కుమ్మరికుంట్ల గ్రామంలో తాటిచెట్టుకు కట్టిన విద్యుత్ తీగలు

దంతాలపల్లి: మండలంలో కుమ్మరికుంట్ల, రేపోణి, లక్ష్మీపురం గ్రామంలో రైతుల పొలాల్లో బావుల వద్దకు కరెంట్ మోటార్ల కోసం తీసిన విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన దోరాపల్లి యాకసాయిలు అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు కిందకు వెలాడుతున్నాయి. కుమ్మరికుంట్ల గ్రామంలో కిందికి వేలాడుతున్న తీగలను తాటి చెట్టుకు కట్టారు. విద్యుత్ అధికారులు స్పందించి తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

మత్స్యకారులు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య


గుర్తింపుకార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో చేపపిల్లలు విడుదల చేసి మత్స్యకారుల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఆదివారం మండలం లోని సూర్యాతండాలో పుల్లూరు పెద్దచెరువు గిరిజన మత్స్యశాఖ సొసైటీ సంఘంలో ఎన్నికైన నూతన సభ్యులకు జిల్లా మత్స్యశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా కొంతమంది అర్హులైన మత్స్యకారులకు జిల్లా మత్స్యశాఖ అధికారి గుర్తింపు కార్డులు ఇవ్వలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందించి జిల్లా మత్స్యశాఖ అధికారితో మాట్లాడి మరో 30 మందికి గుర్తింపుకార్డులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పుల్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన గుండ్లపల్లి ఎల్లయ్య కుటుంబానికి దశదిన కర్మల కోసం క్వింటా బియ్యాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరరావు, కీసర మోహన్‌రెడ్డి, బానోత్ రవి, సురేష్, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు కిషన్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జయరాజ్

కేసముద్రం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జీపీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికులకు నెలకు వేతనం రూ.26వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మంగీలాల్, శ్రీనివాస్, కనకలక్ష్మీ, యాకయ్య, కవిత, సుజాత పాల్గొన్నారు.

కార్మికులకు అండగా యూనియన్


చెక్కు అందిస్తున్న రవీందర్, ఖాజాబాబా

డోర్నకల్: రైల్వే కార్మికులకు, వారి కుటుంబాలకు మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రైల్వే ఉద్యోగి దండెం రాజయ్య కుటుంబానికి ఎంప్లాయీస్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా మంజూరైన రూ.1,63,000 చెక్కును రవీదర్ అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన మరో ఉద్యోగి సీహెచ్ రాము కుటుంబానికి డోర్నకల్ బ్రాంచ్ నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో డీఎం డాక్టర్ సునీల్, డివిజనల్ ప్రెసిడెంట్ ఖాజాబాబా, డోర్నకల్ బ్రాంచ్ చైర్మన్ చరణ్‌నాయక్, సెక్రెటరీ అంజయ్య పాల్గొన్నారు.

ప్రమాద గుంతలు

- భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం
- వాహనాలు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలు


మన్నెగూడెం మార్గంలో భారీ రాళ్లతో వెళ్తున్న వాహనం


ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత


మన్నెగూడెం మార్గంలో ధ్వంసమైన రోడ్డు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ–ముల్కలపల్లి మార్గంతోపాటు కాంపెల్లి–మన్నెగూడెం–ములకలపల్లి మార్గంలో రోడ్లపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసం కావడంతో పెద్ద గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

తొడేళ్లగూడెం–ముల్కలపల్లి మార్గంలో..

ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు నుంచి ముల్కలపల్లి వరకు 13.22 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు విస్తరణ పనులు కొద్ది రోజుల క్రితం పూర్తి చేశారు. రోడ్డు పూర్తయిన కొద్ది రోజులకే సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు సంబంధించిన భారీ వాహనాలతోపాటు ఇతర భారీ వాహనాల రాకపోకలు నిత్యం కొనసాగడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. చాలా చోట్ల రోడ్డుకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ఖమ్మం, డోర్నకల్‌కు వివిధ గ్రామాల నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే రోడ్డుపై గుంతలతో పలు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారినపడ్డాయి.

కాంపల్లి–ముల్కలపల్లి మార్గంలో..

కురవి–ఖమ్మం మార్గంలో 40కిలోమీటర్ల రోడ్డులో కాంపల్లి, మన్నెగూడెం, ముల్కలపల్లి, ఖమ్మం జిల్లా కాసిరాజిగూడెం గ్రామాల మధ్య అనేక ప్రాంతాల్లో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీరోలు మండలంలోని చిలుకొయ్యలపాడు, అందనాలపాడు గ్రామాల పరిధిలోని పలు గ్రానైట్ క్వారీలతోపాటు కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లోని పలు గ్రామాల పరిధిలోని గ్రానైట్ క్వారీల నుంచి భారీ రాళ్లను ప్రతీ రోజు వాహనాల ద్వారా ఖమ్మం తరలిస్తున్నారు. దీంతో రోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడి వాహన ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో ఈ మార్గంలో వాహనాలపై నుంచి భారీ రాళ్లు రోడ్లపై పడటంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. రావిగూడెం సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ కోసం బ్రిడ్జి నిర్మించగా బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు ధ్వంసం కావడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని, గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పెద్ది పూలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, తదితర నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన జాల ప్రవళిక కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రవళిక మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు అయూబ్ పాషా, నాయకులు లింగమూర్తి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలి తండాలో 365 జాతీయ రహదారి పక్కన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తండావాసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి ఆలయంలోని సౌండ్ బాక్స్‌లు రెండు, మైక్‌సెట్, ఆంప్లిఫైర్ బాక్స్, హుండీలో ఉన్న సుమారు రూ.20వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దొంగతనం విషయమై 100కి సమాచారం ఇవ్వడంతో సీరోలు పోలీసులు వచ్చారని తండావాసులు తెలిపారు. ఇదే విషయమై సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

'ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ సరికాదు'


మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

డోర్నకల్: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ జెడ్పీహెచ్‌ఎస్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్ అక్రమమని టీఎస్ యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఆదివారం డోర్నకల్‌లో జరిగిన సంఘం సమావేశంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. పేరువంచ పాఠశాల ఉపాధ్యాయురాలు శిరీష 23 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించి గుర్తింపు పొందారని తెలిపారు. పెరిగిన జుట్టుతో విద్యార్థులు పాఠశాలకు హాజరవుతుండగా తల్లిదండ్రులకు సమాచారమిచ్చినా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక క్రమశిక్షణలో భాగంగా విద్యార్థులకు హేయిర్ కట్టింగ్ చేయించే ప్రయత్నం చేశారని తెలిపారు. దీనిపై శిరీషపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సస్పెన్షన్‌ను రద్దు చేసి శిరీషను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, వివేక్, శివప్రసాద్, మారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి


నిరసన తెలుపుతున్న తండావాసులు

కేసముద్రం: నిరుపేదలైన తమకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు గాను, వెంటనే స్థలాలను కేటాయించాలంటూ మండలంలోని భుక్యాతండా జీపీ శివారు కాలనీ తండాలోని ఇళ్లస్థలాల వద్ద తండావాసులు ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు తండావాసులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 45 మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చిందని, ఆ స్థలంలో తాము ఇళ్లను నిర్మిస్తుండగా, అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అధికారులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో భుక్యా రమేష్, జాటోతు యాకుబ్, విజేందర్, వాల్యా, వెంకన్న, లకావత్ నరేష్, బోజ్యా, వెంకన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

గార్ల: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం మద్దివంచ గ్రామంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ మండల కార్యదర్శి మహేష్‌కుమార్ మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7శాతం నిధులు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయి, చింటూ, వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ఇటీవల మృతి చెందిన సోమయ్య, పూలమ్మ, రామిలి, సోమయ్య కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి ఆదివారం పరామర్శించి, ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు గండి శ్రీనివాస్, గంట బాలకృష్ణారెడ్డి, ఎల్లాగౌడ్, కొంతం శ్రీనివాస్, మల్సూర్, బిక్షం, శ్రీనివాస్, యాదగిరి, దినేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు గిర్నితండాలో ఆదివారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 లీటర్ల సా రాను స్వాధీనం చేసుకుని, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

నివాళి

కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మల్లు హరేందర్‌రెడ్డి మృతదేహానికి ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ నివాళులర్పించారు. అలాగే డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎంపీ కవిత నివాళులర్పించారు.

బియ్యం అందజేత

డోర్నకల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు. స్థానిక యాదవనగర్‌కు చెందిన వీరభద్రం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా విజయా ఫౌండేషన్ ప్రతినిధి మాళోత్ రామారావు 20కేజీల బియ్యంతోపాటు రెండు ఆయిల్ ప్యాకెట్లు అందించి ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో వీరబోయిన ఉపేందర్, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్మానం

నెహ్రూసెంటర్: తెలంగాణ ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికై మహబూబాబాద్‌కు విచ్చేసిన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ, ఎండి.రజియా, పాలెపాక ప్రవీణ్, పద్మ, సరిత, సౌమ్య, ఎండిపాష, ఎంఆర్‌పీఎస్ దండోరా నాయకులు కొండ్ర ఎల్లయ్యమాదిగ, గాడిపెల్లి వెంకన్న, రాదా, సుదా, శ్రీను పాల్గొన్నారు.

మేరు సంఘం కమిటీ ఎన్నిక



మరిపెడ: మేరు సంఘం మండల శాఖ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమా కోటేశ్వరరావు ఆదేశాల మేరకు పరిశీలికుడిగా అడపా మల్లికార్జున్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుంటి రవి, ఉపాధ్యక్షుడిగా వెన్ను ఉపేందర్, కోశాధికారిగా మడిశెట్టి విజయ్, ప్రధాన కార్యదర్శిగా కీర్తి నర్సింగరావు, గౌరవ సలహాదారులుగా రామగిరి సత్యనారాయణ, కీర్తి నర్సింహారావులను ఎనుకున్నారు.

దళిత నాయకులపై ఆరోపణలు తగదు

నర్సింపేట: దళిత సామజిక వర్గానికి నాయకులపై బీసీ, ముదిరాజ్ సంఘం నాయకులు ఆరోపణలు మానుకోవాలని భూపోరాట సమితి కన్వీనర్ మంద ప్రకాశ్, కులపెద్దలు గనిపాక సంజీవ, బాణాల శ్రీనివాస్, మాదాసి రవి కోరారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నంబర్ 121లోని భూమి కోసం పోరాడి కేసుల పాలై ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. భూమిపై తమకే అన్ని హక్కులు ఉన్నాయన్నారు. బీసీ సంఘాల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన ద్యాగల శ్రీను ఆరోపణలు మానుకోకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వినియోగదారులను మోసగిస్తే చర్యలు

తొర్రూరు: వినియోగదారులను మోసగిస్తే చర్యలు తప్పవని వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా కన్వీనర్ వింజమూరి సుధాకర్ అన్నారు. వరంగల్‌కు చెందిన ఏ.రాజేశ్వరరావు రాంకీ కంపెనీ గృహ నిర్మాణ విల్లాలో రూ.56లక్షల ఒప్పందంతో ఇల్లును కొనుగోలు చేశాడు. మొదటి, రెండవ విడతల్లో రూ.12లక్షల చొప్పున రూ.24 లక్షలు చెల్లించాడు. తదనంతరం ఆ సంస్థ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి రాజేశ్వరరావుకు అప్పగించింది. అనంతరం రిజిస్ట్రేషన్ నిమిత్తం సంస్థ ప్రతినిధులను సంప్రదించగా ముందస్తు ఒప్పందానికి విరుద్ధంగా అదనంగా డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురి చేశారు. రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెట్టడంతో బాధితుడు వినియోగదారుల సమాచార కేంద్రంను సంప్రదించాడు. బాధితుడి ఫిర్యాదును పరిశీలించిన సమాచార కేంద్రం బాధ్యులు సంస్థ ప్రతినిధులకు నోటీసులు పంపారు. దానికి సంస్థ ప్రతినిధులు స్పందించకపోవడంతో 'రెరా' చట్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. వినియోగదారులను మోసగిస్తే చర్యలు తీసుకుంటామని సుధాకర్ తెలిపారు.

క్లుప్తంగా

31న కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 31 గురువారం జిల్లా కిడ్స్ అథ్లెటిక్ బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాస నాగమణి ఆదివారం తెలిపారు. జావెలిన్‌త్రో 100 నుంచి 400 మీటర్స్ ఉంటుందన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు. పీఈటీలు సకాలంలో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 90526 70288 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలి



డోర్నకల్: వనమహోత్సవంలో భాగంగా డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మొక్కలను పంపిణీ చేస్తున్నారు. ఆదివారం 11వ వార్డులో మున్సిపాలిటీ, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి చెట్లుగా ఎదిగేంత వరకు మహిళలు బాధ్యత వహించాలని మెప్మా ప్రతినిధి బందిగ ఉపేంద్ర కోరారు.

దడువాయి సంఘం కమిటీ ఎన్నిక


ఉప్పలయ్య, అధ్యక్షుడు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయం మార్కెట్ దడువాయి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా అధ్యక్షుడిగా చింతల ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా బీసు అశోక్, కోశాధికారిగా ఇస్లావత్ దస్రు, గౌరవ అధ్యక్షుడిగా రాష్ట్ర దడవాయి సంఘం అధ్యక్షుడు సరసాని సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నూనావత్ మంగీలాల్, సహాయ కార్యదర్శిగా ఢిల్లీ రమేష్, గౌరవ సలహాదారులుగా జనార్ధన్, మాధవ్, కార్యవర్గ సభ్యులుగా బెల్లి రాజు, నిమ్మల కరుణాకర్ రెడ్డిని ప్రకటించారు.

వీరన్న సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ ఉమా దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వీరభద్రస్వామిని కుటుంబసభ్యులతో కలసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వేద ఆశీర్వచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే తన నూతన వాహనానికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట నాయకుడు అవిరె మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామ చెరువుకట్టపై కొలువైన రజకుల ఆరాధ్య దైవమైన శ్రీమడేలేశ్వరస్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొల్లచర్ల రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మడేలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు జలాభిషేకం చేసి బోనాలు చెల్లించుకున్నారు.

అనారోగ్యంతో వార్డు కౌన్సిలర్ మృతి

మరిపెడ: అనారోగ్యంతో మరిపెడ మున్సిపాలిటీ నాల్గో వార్డు కౌన్సిలర్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మచ్చర్ల స్రవంతి(35) మృతి చెందారు. మృతురాలు రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురి కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆదివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, గుడిపుడి నవీన్, మహేందర్‌రెడ్డి, ఎడెల్లి పరశురాములు, పానుగోతు వెంకన్న, బయ్య బిక్షం, లతీఫ్, వస్రాం తదితరులు పాల్గొన్నారు.